# కోడలు

[ కథానిక ]

= శ్రీ యర్రంశెట్టి =
హనుమంతరావు

## [ మొదటిభాగము ]

### ౧

లలిత కాపరానికి వెళ్లింది, వెళ్లలేదు. పెద్దసంబంధం చేద్దామని దురాశకుపోయి లలితతండ్రి బుచ్చి వెంకయ్యగారు లలిత మెడకు ఉరివేసినాడు.

తాహతులేని పనులు చేసి తలవంపులు తెచ్చుకొనేకన్న గుడ్డకు తగినట్టు కోటు కుట్టించుకోవడము ఉత్తమము. పెంపుడుకొడుకు, పెద్దఆస్తి, బి. యల్. చదువుతున్నాడు, చూపులకు నదరుగా ఉంటాడు అని పోటీలమీద పోటీలకు వెళ్లి మూడువేలకట్నం, వెయ్యిన్నూటపదహారురూపాయల లాంఛనాలు అనే షరతుతో లలితతండ్రి సుందరరావుసంబంధానికి ఒప్పుకొన్నాడు.

ముందే నాలుగువేలు పంపించమంది సుందరరావు పెంపుడుతల్లి వెంకాయమ్మ. కాని ఆవిడదగ్గిర చుట్టమున్నూ, బుచ్చివెంకయ్యగారి స్నేహితుడున్నూ అయిన రామమూర్తిగారు బుచ్చివెంకయ్యగారివంటి పెద్ద మనిషి ఆంధ్రదేశములో లేడనిన్నీ, అనవసరమైన పేచీలు పెట్టి తనకున్నూ, తన పెంపుడుకొడుకుకున్నూ తలవంపులు తీసుకొనిరావద్దనిన్నీ గట్టిగా సలహాచెప్పినాడు. ఆవిడ సరేనన్నది. పెళ్లివారంతా తరలి వచ్చారు. పెళ్లిపీటలదగ్గర బుచ్చివెంకయ్యగారు మూడువేల కట్నం, వెయ్యిన్నూటపదహారురూపాయల లాంఛనాలు చెల్లించాడు. కాని వెండికంచంలో ఉన్నవి వెయ్యిన్నూటపదహారు వెండిబిళ్లలు, రెండువేలరూపాయల నోటు, తక్కిన వెయ్యిరూపాయలు లాంఛనాల రూపంగానూ వున్నవి.

పెళ్లికిముందరే తానెంత ప్రయత్నం చేసినా కట్నం భర్తీ చేయడానికి రెండువేల రూపాయలు దొరకలేదనిన్ని, పరువు ప్రతిష్ఠలతో బ్రతికినవాడవడముచేతనూ, పెద్దకూతురి పెళ్లవడముచేతను పెళ్లి డాబుగా చేయాలని ఎంత ప్రయత్నం చేసినా తాను నాలుగువేల రూపాయలకన్న ఎక్కువ పోగుచేయలేకపోయినాననిన్ని, వ్యవధి లేకపోవడముచేత భూమిని తాకట్టుపెట్టిగాని, అమ్మిగాని తక్కిన రెండువేల రూపాయలూ తీసుకొనిరాలేకపోయినాననిన్ని, కొద్ది రోజులలో ఏదోరకంగాచేసి తక్కిన రెండువేల రూపాయలూ భర్తీచేయగలవాడనననిన్ని, అందాకా ఆ రెండువేలరూపాయలకూ ఒకప్రోనోటు వెయ్యిన్నూటపదహారులతో పెట్టి సమర్పించుకొంటున్నాననిన్ని బుచ్చి వెంకయ్యగారు రామమూర్తిగారితో ప్రాధేయపడ్డాడు. సరళహృదయం గల రామమూర్తిగారు "సరే, నేనేదో తంటాలుపడి వియ్యపరాలిని ఒప్పిస్తాను. ఈ సంగతిమాత్రం ఎవరితోనూ చెప్పవ" ద్దని సలహాఇచ్చాడు.

పెళ్లివారి ఆడవాళ్లమధ్య కూర్చున్న వియ్యపరాలు రామమూర్తిగారిని పంపి "కట్నం అంతా సరిగ్గా వుందయ్యా, చూడ"మని ఆజ్ఞఇచ్చింది. "ఆ. ఆ. సరిగ్గానే ఉం" దని జబాబుచెప్పాడు.

పెళ్లి మూడుముళ్లూ పడ్డాయి. వెండికంచం రూపాయలు వియ్యపరాలుగారికి అప్పగించారు. రొఖ్ఖం వెయ్యిన్నూటపదహారురూపాయలు మాత్రమే ఉండడమూ, ఆ రూపాయలమధ్య రెండువేల రూపాయలకు నోటు ఉండడమూ చూసింది. ఆమె ఆడుపులి అయిపోయింది. కళ్లు చింతనిప్పులలాగ అయిపోయినవి.

కోపముచే పెదవులు వణికినవి. "రామమూర్తిని ఇల్లా పిలవం" అన్నది. ఆయన రాగానే ఆ పదిమంది ఆడవాళ్లమధ్యా అతన్నిపట్టుకొని హీనుడనీ, కుట్రదారుడనీ, దొంగఅనీ, పరమచండాలుడైన పెండ్లికూతురు తండ్రితో కలిసినాడనీ, తన మంచితనాన్ని సావకాశం చేసుకొని వియ్యంకుడూ, రామమూర్తీ తన్ను తీరని అవమానపరచి పరమచండాలమైన పని చేశారనీ తల వాచేటట్టు చివాట్లు పెట్టి, ఆ వెధవ పెంపుడుకొడుకు కూడా పెళ్లివారితో ఏకమయ్యాడనీ, వాడు తనింటికి ఎల్లా వస్తాడో చూస్తాననీ కేకలువేసి, ఆయాపాయలూ, ఆనోటూ అక్కడే గభిల్లని పారవేసి పెళ్లివారింట్లో పెళ్లిభోజనమైనా చేయకుండా తన రెండెడ్లబండి కట్టించుకొని స్వగ్రామానికి వెళ్లిపోయింది.

## ౨

ఈ గడబిడ అంతా పెండ్లికొడుకు సుందరరావుకేమీ తెలియదు. బంగారు ముద్ద, రూపం పొందిన సౌందర్యం, నాలుగోఫారమువరకు చదువుకొన్న విద్యావంతురాలు భార్యగా దొరికిందనే సంతోషించాడుగాని తన పెంపుడుతల్లిగారి హృదయంలో దావానలం, ప్రచండమైన తుపాను, మహాప్రళయం చెలరేగిందని అతని కేమి తెలుసును?

పెళ్లితంతు లన్నీ అవగానే నూతనవస్త్రాలతో, కలకలలాడు స్వరూపంతో లక్ష్మీదేవిలా వధువు తన చిటికినవ్రేలిని పట్టుకొని కూడా రా తల్లికి నమస్కారము చేయడానికి పెండ్లికొడుకు వెళ్లేటప్పటికి పెళ్లివారిలో తక్కిన ఆడవాళ్లు జరిగిన ఆ ఘోరవిషయం అతనితో పరిపరివిధాలుగా నొక్కిచెప్పినారు. సుందరరావు భయంతో గజగజలాడిపోయినాడు.

సుందరరావు ధైర్యములేని మనిషి. చిన్నతనంలోనే వెంకాయమ్మగారికి దత్తత వచ్చాడు. వెంకాయమ్మ బీద అక్కగారి కొడుకు. కన్న కుటుంబములో అయిదుగురు అన్నదమ్ములలో ఆఖరువాడు. వెంకాయమ్మ భర్తకు రెండవభార్యగా వెళ్లింది. ఆవిడభర్త లక్షాధికారి; ఆస్తిపరుడు. ప్రథమభార్య ఒక్కకూతుర్ని కని కూతురుతోపాటే పరలోకానికి వెళ్లిపోయింది. వెంకాయమ్మపుట్టింటివారు బీదవారు. ఆరుగురు అప్పచెల్లెండ్రలోనూ నాలుగో అమ్మాయి వెంకాయమ్మ. స్ఫురద్రూపి; ఆరితేరిన అప్సరస; ఆడుపులిలాంటి, తెల్లత్రాచులాంటి అందం; పెంకిపిల్ల; గడుసరి; రెండవభార్యగా మొగుడుదగ్గరికి కాపరానికి వెళ్లిందగ్గరనుంచి భర్తను పాదదాసునిగా చేసుకొంది. భర్తను ఇంగ్లీషురాజును చేసి సింహాసనం ఎక్కించి సర్వాధికారాలూ వహించి తానే మంత్రి అయి రాజ్యాధికారం చలాయించసాగింది. భర్త కలలోనైనా ఎరగని వాత్స్యాయనశాస్త్రసంతోషము అతనికి సమకూర్చింది. భర్తవ్యాపారాలు భర్తకన్న జాగ్రత్తగా, లాభకరంగా నడుపుకువచ్చింది.

వెంకాయమ్మకన్న ఇరవయి ఏండ్లు పెద్దవాడైన భర్త తన అరువదియవ ఏట తన సమస్తమైన ఆస్తికీ వెంకాయమ్మకు సర్వహక్కు లిచ్చి, ఇష్టమైన కొడుకును పెంచుకొనే హక్కుగూడా యిచ్చి సంతోషముతో స్వర్గమునకు వెళ్లిపోయినాడు. నీళ్లులేని కండ్లతో వెంకాయమ్మ రెండుమూడునెలలు ఏడ్చింది. అప్పగారి కొడుకును వైభవముగా దత్తత చేసుకొంది. భర్తకన్న ఎక్కువ వినయవిధేయతలు గలిగిన బాలకుడుగా పెంపుడుకుమారుని తయారుచేయ దలచింది. స్వాతంత్ర్యమూ, వివేచనా పెంపుడుతల్లిగారి సంరక్షణలో ఉంచి విద్యార్థిదశ ప్రారంభించాడు సుందరరావు. కష్టపడి పరీక్షలు ప్యాసయినాడు. తల్లిమాటే వేదవాక్కు. ఆమె గీచిన గీటు పెట్టని కోట. ఆమె పొమ్మన్నది పోక, రమ్మన్నది రాక. ఆమెఆజ్ఞ సర్వసైన్యాధ్యక్షుని ఆజ్ఞ. కుడి, ఎడమ, కుడి, ఎడమ (Right, left. Right, left)— జీవితసైన్యపుదారిలో సుందరరావు సైనికుడై నడక సాగించాడు.

## 3

తల్లినీ, తననూ అత్తవారు ఇల్లా అవమానముచేస్తారా?—సుందరరావు చండభానుడైనాడు. అగ్నివర్షము కురిపించాడు. పెండ్లివారిని బళ్లు సిద్ధంచేయమన్నాడు. పెండ్లిభోజనమైనా చేయకుండా పెండ్లి

కూతుర్ని, లాంఛనాల్ని, కట్నాన్ని అత్తవారింటిదగ్గరే పారవేసి స్వగ్రామానికి వెళ్లి తల్లిని చేరుకొన్నాడు.

ఈ సంబంధము రావడము తనదే లోటని పెంపుడు తల్లి తిట్టిన తిట్లన్నీ పడ్డాడు. అత్తవారిని తల్లి తిట్టిన పదివేలతిట్లకూ తాను స్వంతముగా పదిహేనువేల తిట్లు చేర్చాడు. తల్లిగారి ఆజ్ఞ అయితే మర్యాదగల మరో సంబంధము చేసుకోవడానికి తాను సర్వసిద్ధమన్నాడు.

ఆ సాయంత్రానికే పెండ్లిమధ్యవర్తియైన రామమూర్తిగారు నాలుగువేల రూపాయలతో, పెండ్లికొడుకు వదలిపెట్టిన పెండ్లికూతురుతో, లాంఛనాలతో, పెండ్లికూతురుతాలూను ఇద్దరు ఆడచుట్టాలతో చక్కా వచ్చారు. పెండ్లికుమారుడు నోరెత్తకుండా, వెంకాయమ్మగారినోట మళ్లీ మాట రాకుండా గంగానదిలా, ఉప్పెనకెరటములా తమ కుటుంబాలలో యిటువంటి అమర్యాద ఎప్పుడూ జరగదనీ, తప్పుచేస్తే దండించాలిగాని తెలివితక్కువగా పారిపోయిరావడము ప్రజ్ఞలేనితనాన్ని సాటించుకొంటుందనీ అన్నాడు. కార్యనిర్వహణశక్తి ఎంత ఉంటేనేమిటి, ఆపద ఆపదే అనిపించుకొన్నదన్నాడు. వచ్చిన కోపం చూపించుకోవడము ప్రజ్ఞావంతుల విధానమే కాదన్నాడు.

రామమూర్తిగారిని అన్నీ చెప్పనిచ్చింది వెంకాయమ్మ. అకణ్ణించి ప్రచండమారుతానికి పరవళ్లు తొక్కే పంచమహాసముద్రాలవలెనే కెరటంమీద కెరటంతో పరవళ్లుతొక్కింది. రామమూర్తిగారు సత్యాగ్రహం చేస్తానన్నాడు. ఊళ్లోవాళ్లను, కాంగ్రెసువాళ్లను తీసుకొనివచ్చి గుమ్మానికి ఎదురుగుండా నిరాహారవ్రతం చేస్తానన్నాడు. అన్యాయమంటే ఏమిటో ఎరగని వెంకాయమ్మగారు ఒక పర్వశుభకార్యంలో, కారణమున్నా సరే, అంత ఆవేశపూరితురాలు కాకూడదన్నాడు. భట్రాజులకన్న, నారదుడికన్న, భక్తులకన్న, ఆదిశేషువుకన్న, సముద్రుడికన్న ఎక్కువ ప్రజ్ఞతో పొగిడాడు వెంకాయమ్మను.

ఇదివరదాకా వెనకాలనే వున్న వియ్యంకుడూ, వియ్యపురాలూ వచ్చి తమ్ము క్షమించవలసిందని ఆవిడ కాళ్లమీద పడ్డారు.

గృహప్రవేశం జరిగిపోయింది. కాని మనుగుడుపులకు పెండ్లికొడుకును అత్తవారింటికి పంపించనంటే పంపించనంది వెంకాయమ్మగారు.

## ౪

కాలప్రవాహము నెమ్మదిగా జరిగిపోయింది. సుందరావు బి. యల్. ప్యాసై, అప్రెంటిసై, ఏలూరులో ప్రాక్టీసు మొదలుపెట్టినాడు.

ఈలోగా బుచ్చివెంకయ్యగారు ఎన్నివేలసార్లు అడిగినా, ఎంతమంది పెద్దమనుష్యులచేత కబుర్లు పంపించినా కొడుక్కు కార్యం చేసుకోవడానికి నిరాకరించింది వెంకాయమ్మ. కారణమేమిటో చెప్పదు. పెండ్లినాడు జరిగిన వ్యాపారవిషయంలో ఆమెకు వచ్చిన కోపం పోలేదా అంటే దానికీ దీనికీ సంబంధము లేదంటుంది. చేసిన తప్పు సర్దుకోవడముతో సరిపోదంటుంది. తప్పులకు శిక్షలున్నాయంటుంది. ఆవిడ భావం ఎల్లా గ్రహించాడో గ్రహించాడుగాని బుచ్చివెంకయ్యగారు హృదయంలోంచి ఓడ్చి గడ్డగట్టించిన రక్తపుముక్కలలాంటి అయిదువందల రూపాయలూ బ్యాంకుడ్రాఫ్టుచేసి వెంకాయమ్మగారికి పంపించి కార్యం చేసుకోవలసిందని వినయంగా ప్రాధేయపడ్డాడు. కార్యం తనయింటిదగ్గరే చేసుకోవడమనీ, ఒక్క పెండ్లికూతుర్నీ, పెండ్లికూతురి తల్లినీమాత్రము పంపించవలెననీ జవాబువ్రాసింది. ముహూర్తం పెట్టి భార్యనూ, కూతుర్నీ పంపించాడు బుచ్చివెంకయ్య.

కార్యం జరిగింది. స్కూలుఫైనలు ప్యాసైన లలిత అత్తవారింటిదగ్గరే కాపురంచేస్తూ ఉండిపోయింది.

అదిమొదలు లలితబ్రతుకు దినదినగండము. దేముడే దిక్కు అన్నట్లు అయిపోయింది. అందమైనది, చదువుకొన్నది, తెలివైనది. కాని, ఏమి లాభము, మహారాణియైన అత్తగారికి బానిస అయిపోవలసిన వ్రాత ఉన్నప్పుడు? మొగుడు దద్దమ్మ – యమకట్టుబాట్లతో తయారయినవాడు- పెంపుడుతల్లికి మారుపలకగలడా? భార్యను రక్షించగలడా? సోగకళ్లుగలది అయితేనేమిటి, మెరుగుపెట్టిన బంగారంలాంటి ఛాయగలదైతేనేమిటి,

కోలమోమూ, మన్మథుని విల్లులాంటి పెదవులూ, సూర్యకాంతపుష్పపు రేకుల్లాంటి చెక్కిళ్లూ, కలవ మొగ్గల్లాంటి చెవులూ — అయితే నేమి లాభం? కోకిలగొంతుకలాంటి గొంతైతే నేమి లాభం? ఆమె చదువుకొన్న చదువూ, ఆమెలో సహజంగా వుండి క్రమశిక్షణపొంది వృద్ధిపొందిన దివ్యగాంధర్వమూ భర్తయొక్క భయమహాకూపంలో తాడుతెగిపోయిన చాదల్లా పడిపోయాయి. లలితయొక్క అందాలపోగు తనము భర్తయెదుట మహాబధిర శంఖారావమై పోయింది.

చెప్పినట్లు చేస్తే ఆలోచన లేని దద్దమ్మ అని తిట్లు. చెప్పకుండా ఏదైనా చేస్తే వెధవస్వతంత్రాలతో దేశం తగలడిపోతూందని తిట్లు. తనకన్న ముందర లేస్తే ఎవరూ లేకుండా చూసి యిల్లంతా దోపిడీచేయించవలచుకుందని సాధింపు. తనతో సమంగా లేస్తే అత్తగారితోపాటు దర్జా కావాలా అని తిట్లు. ఒక చిటిక ఆలస్యంగా లేస్తే రాణీలకన్నా లేని దర్జా వచ్చిందని తలవాచేటట్టు చివాట్లు. వంట ఎంత బాగా చేస్తేనేమి-కూరలో పోపు మాడిపోయిందనీ, పచ్చడిలో వుప్పు ఎక్కువయిందనీ, పులుసు ఉడకలేదనీ, అన్నం బిరుసుగా వారిందనీ, లేకపోతే చిమిడిపోయిందనీ వెటకారాలు. కోడలు పోతరించివుంది, పనిమనిషి ఎందుకని పనిమనిషినన్నా పెట్టించలేదు వెంకాయమ్మ.

ఒకనాడు ఇలాగే ఎందుకో అత్తగారు తిట్టుతూంటే మనస్సు ఉండబట్టలేక లలితమ్మ జవాబు చెప్పిందట-"ఎందుకండీ అత్తగారూ, అల్లా అంటారు" అని. ఇక చూడండి, ఆ రోజున మాటల్తోనే కోడల్ని చీల్చేసింది. తల్లిపక్షం వహించి కొడుకుకూడా నాలుగు దేహప్రహరణాలు అర్పించాడు. ఏడవకన్నా ఏడ్చిందిగాదు లలిత; కొయ్యబారి మొద్దయిపోయింది.

పుట్టింటికి ఒక వుత్తరమైనా వ్రాయడానికి వీలులేదు. పొరుగింటివారు దయదలచి జరిగే సంగతులన్నీ బుచ్చివెంకయ్యగారికి వుత్తరాలు వ్రాశారు. అదివరకే బుచ్చివెంకయ్యగారు వచ్చి పండగకు పంపమనీ, పబ్బానికి పంపమనీ ఎన్నిసార్లు అడిగినా అత్తగారు కొడుకునుగాని, కోడలినిగాని వియ్యాలవారింటికి పంపించింది గాదు. కూతుర్ని తండ్రితో మాట్లాడనియ్యనైనా లేదు. వియ్యంకునిని భోజనానికైనా పిలవలేదు. పైగా, "తాను మహా మంచివాడని వీరూ వారూ చెప్పడంవల్ల రెండువేలరూపాయలకు నోటు వ్రాసి కట్నమని చెప్పి ఇచ్చి తనకు తీరని అవమానం చేస్తాడా? అటువంటిమనిషి తనఇంట్లో విస్తరివేస్తాడా? అల్లుణ్ణీ, కూతుర్నీ తన ఇంటికి తీసుకొనివెళ్లి కురుపుతాడా? తనకు చేసిన అవమానాన్ని తాను తనజన్మంతా మరచిపోతుందా" అంటూ కోడలిదగ్గరకు వెళ్లి నానా అరుపులూ అరిచేది వెంకాయమ్మ.

* * *

లలితహృదయం ఎవరు వర్ణించగలరు? లోకంలో ప్రేమ అనేదే ఉండదా? మనుష్యుల కక్షలే ప్రధాన జీవితాలై వుంటాయా? మెత్తని మనస్సులనుకొనే ఆడవాళ్ల హృదయాలే లోకవాడుకకు విరుద్ధంగా కాలకూటవిషంతో నిండివుంటాయా? సామరస్యమనేది ప్రపంచంలో హుళక్కేనా? దయ, అంతఃకరణ—ఇవి గ్రంథాలలోనూ, ఉపన్యాసాలలోనేనా? తనచుట్టాలలో ముసలివాడి దగ్గరనుంచి పడుచువాళ్ల వరకూ భర్తలతో కాపురముచేస్తున్నవాళ్లు లేరా? అందరు అత్తగార్లూ ఇలాగే తమ కోడళ్ల జీవితాలను కాలిక్రింద పురుగుల్ని రాసివేసినట్టు రాసివేస్తున్నారా?

అవమానమే తన జీవితము. ఈ తీరనిబాధ రేపు, ఎల్లుండి చల్లారుతుందా? ఈయనచదువేమైనది? జ్ఞానము, నాగరికత- ఇవి పాశ్చాత్యవిద్యలోనే లేవా? ఆచదువుకు హిందూజాతే తగదా?

లలిత కాపరానికి వచ్చినదిమొదలు మైమరచి నిద్రపోయి ఎరగదు. నవ్వు ఆమెముఖాన్ని విడిచి ఏనాడో పోయింది. కడుపులో మంట. కర్కశమైన ఆమెచేయి ఆమెహృదయాన్ని గుడ్డపిండినట్టు పిండుతోంది. ఆమె మెదడు వేడెక్కింది. నలిగిపోయే గుండెయొక్క రక్తం కన్నీరై ప్రవహించి ప్రవహించిపోయింది. దుఃఖమే తప్ప ఇతర మెరుగని ఆమెకళ్లు కాళరాత్రై కళలుతప్పి మూసుకుపోయినవి.

ఒకనాడు—

ఒక్కుమ్మడిగా లేచింది. ఆమెఒళ్లు గజ గజలాడిపోయింది. ముఖము జేగురించింది. ముక్కు పుటములు విస్ఫారితములై కన్నులు కెంపు లెక్కాయి. గబగబ ఒంటినున్న నగలన్నీ తీసింది. ఆ నగలమూట చేత్తో పట్టుకుంది. భోజనం చేసి హాలులో దీపందగ్గర కూర్చొని వార్తాపత్రిక చదువు కొనుచున్న భర్తదగ్గరకు వెళ్లింది. ఆ నగలమూట బల్ల మీద ఎత్తిపడవేసింది. ఆమెమాటలలో మంటలు లేవు. ఆమెమాటలలో మంచుగడ్డలు. ఆమెకళ్లలో కోపము లేదు. అసహ్యత అతిపదును గల సూన్నీలులా కళ్లలో ప్రవహించింది.

"ఇదివరదాకా మీ ఇంట్లో బానిసత్వం చేశాను. దాద్వారా స్త్రీజాతినంతా అవమానంలోకి తీసుకొనివచ్చాను. నా నగలయందుగాని, నా గుడ్డల యందుగాని మీకూ, మీతల్లికీ ఏమాత్రమూ అధికారము లేకపోయినా ఈ కట్టుగుడ్డలుతప్ప తక్కినవన్నీ వది లేసి వెళ్లుతున్నాను. కాని నాకు ఈ మంగళసూత్రము హిందూజాతి, భగవంతుడు ప్రసాదించినది. అది మాత్రం వదలుకోలేని పిరికితనం నాలో వుంది. మీలో ఏమైనా మొగతనం వుంటే ఈ ఆస్తికి హక్కు మీ పెంపుడుతల్లి పాదాలదగ్గరే ధారపోసి, వున్నవారు వున్నట్టుగా నాతో రండి—"

"ఛీ, పాడుముండా! ఇదివరదాకా లేని నోరు కూడా వచ్చిందీ!...అమ్మా, చూడవే, ఈముండ ఏమం టుందో" అని తల్లిని కేకవేశాడు సుందర్రావు.

"ఏమిట్రా నాయనా? నిన్ను కొట్టవచ్చిందా?" అని అత్తగారు లోపల్నుంచి పరిగెట్టుకొచ్చింది. లలిత మాట్లాడకుండా వీథితలుపు తీసి "నేను మాపినతల్లిగా రింటికి వెళ్లుతున్నా"నని ఒక్క కేకవేసి ఊళ్లోవున్న తన పినతల్లిగారింటికి ఆ ఎనిమిది గంటల రాత్రివేళ చక్కా పోయింది.

మరి ఇరువదినిమిషములలో లలితపినతల్లికొడుకు సుందర్రావుదగ్గరకు వచ్చి, "ఇదేమిటయ్యా బావ గారూ, మాచెల్లెలు మాయింటికొచ్చి అల్లా అంటుం దేమిటి" అన్నాడు.

సుందర్రావు రౌద్రాకారం దాల్చి, "నువ్వూ, నీచెల్లెలూ మీరంతా ఒక్కటే! సానిదౌతుంది గాబోలు, అవనియ్యి" అని ఇంకా ఏమేమో వాగ బోయినాడు.

లలితపినతల్లికొడుకు "ఛీ! నోరుముయ్యి. మీరు మాచెల్లెల్ని పెట్టిన బాధలన్నీ వింటూనే వున్నాను. భగవంతుడే మీకు ఏనాటికైనా సరిగ్గా బుద్ధిచెప్తాడు" అని సుందర్రావు చెప్పే మాటలను వినకుండానే వెళ్లిపోయినాడు.

[రెండవ భాగము]

౧

ఏది వర్షాకాలాలు పెళపెళ వరదలు కట్టి జరిగి పోయినాయి.

ఏలూరు గవర్నమెంటుఆస్పత్రిలో ఆడవాళ్ల వార్డు కిటకిటలాడిపోతోంది. లేడీడాక్టరు నవ్వు మొగంతో, చల్లని మాటల్తో రోగులను విచారిస్తూ మందులు వ్రాసియిస్తూ రెండుగంటలలో వచ్చినవారి పనంతా పూర్తిచేసి తొమ్మిదిగంటలకు ఆడవాళ్ల వార్డును పరీక్షచేయడానికి బయలుదేరింది.

"అమ్మా దొరసానమ్మా! నిన్నటింంచి నాఒంట్లో చాలా బాగుందండీ"

"డాక్టరమ్మగారూ, ఇంక నేను ఆస్పత్రి నుండి వెళ్లిపోవచ్చునాండీ? ఒంట్లో శానా బాగుం దండీ"

"మీరు దేవతలండీ. మీరు వచ్చిన పదిహేను రోజులనుంచీ నాకు సెప్పరాని ధైర్యమండీ."

ఇలాగ పదిహేనురోజుల క్రిందటే వచ్చి ఛార్జీ పుచ్చుకొన్న ఈ కొత్త డాక్టరమ్మ అంటే సాక్షాత్తు ఆరోగ్యదేవతే అని చేతులెత్తి దండముపెట్టని రోగులు లేరు.

పదకొండు గంటలవరకూ రోగుల నందరినీ చూచింది. నర్సులకు ఇవ్వవలసిన ఆజ్ఞాపనలు ఇచ్చింది. అయిస్ఫ్రూట్‌లాగ చల్లగా తియ్యగా, గులాబి

పువ్వుల్లాంటి పరిమళంగా మాటలాడుతూ చకచక పనులన్నీ నెరవేర్చుకొని తన చిన్న ఆస్టినుకారు నడుపుకొంటూ యింటికి వెళ్లిపోయింది డాక్టరు దొరసాని.

ఈ పదిహేనురోజులలోనే ఈ లేడీడాక్టరు చాలా ప్రజ్ఞావంతురాలనీ, చల్లని చేయి అనీ, ఆడకేసులు చికిత్స చేయడములో జిల్లా వైద్యాధికారి కన్న ఎక్కువ తెలివిగలదనీ చాలా పేరు పొందింది. ఆమె క్రింద పనిచేసే నర్సులూ, మంత్రసానులూ ఆమె ప్రతిభను మూడురోజులలోనే గ్రహించారు. ఆమె దగ్గర అనవసరప్రసంగానికి తావు లేదు. ఇసుమంత కోపమైనా కనపరచక తన క్రిందివారల పూజలు చూరగొను అధికారిణి ఆమె. ఆమెతోడి పురుష అసిస్టెంటు సర్జను, వారిదువురిపైన జిల్లా వైద్యాధికారి ఈమెను చూచి ఏమేమో ఆలోచనలు పోయి ఏవేవో ఉత్ప్రేక్షలు గారు.

ఆమె అసమానరూపలావణ్యము అనేకమందికి అనేకవిధాల వూహలు జనింపజేసింది. తోడి పురుష అసిస్టెంటు సర్జను ఆమెతో ఏవేవో సరదామాటలాడుతూ ఆనందము పొందుదామని వచ్చి ఆమె మూర్తిని విడంబించివున్న ఏదో శక్తి తన్ను నిలబెట్టినట్లు కాగా చల్లచల్లగా వెనక్కు జారిపోయినాడు.

ఆమె తిన్నగా యింటికి పోయింది. స్నానము చేసి శుభ్రవస్త్రాలు ధరించి, వంట ఇంట్లోకి పోయి భోజనముచేసి, తాంబూలము వేసుకొని, ఆనాటి పత్రికలన్నీ చదివి, పడకగదికిపోయి పదినిమిషములు విశ్రమించి నిదురపోయింది. మూడుగంటలకు లేచి మొగము కడుగుకొని బట్టలు మార్చుకొని శుభ్రదేవతలా, శాంతిదేవతలా, రూపొందిన ఆరోగ్యదేవతలా తిరిగి ఆస్పత్రికి చేరుకొన్నది.

ఆసాయంత్రం ఆసుపత్రిలో ఆమె పనిచూస్తూ ఉండగా బంట్రోతు వచ్చి "అమ్మా, సుందరరావుగారనే ప్లీడరుగారు తన భార్య నీళ్లాడలేక కష్టపడుతూందనీ, తమ సహాయము కావాలనీ వచ్చారు. వారి యిల్లు పవరుపేటలో చెరువుప్రక్కన ఉన్నదట. తమతో మాట్లాడాలని పురుషులు కూర్చునివుండే స్థలములో కూర్చొని వున్నారు. ఆయన్ని చూస్తే చాలా కంగారు పడుతున్నట్లున్నారు" అని కబురు చెప్పాడు.

ఈమాటలు వినగానే డాక్టరమ్మ మనస్సులో చాలా కంగారుపడింది. ఆమెగుండె దడదడ కొట్టుకొన్నది. అతిప్రయత్నముమీద మనస్సు కుదటపెట్టుకొని, కొంచెముగా వణకుచున్న చేతులను దృఢము చేసుకొని, "ఈవూరులో ఇంక వేరే ఆడడాక్టరులు లేరా ?" అని ప్రశ్నించింది.

"లేకేమండీ అమ్మా? ఓమిషనరీడాక్టరుదొరసానమ్మను క్రిందటిపురుటికి తీసికెళ్లారంటండమ్మా. ఆమె సరిగా వైద్యం చేయలేకపోయిందట. ప్రాణాపాయం వస్తే జిల్లాడాక్టరుదొరగారిని తీసికెళ్లారట. ఆడాక్టరమ్మచేసిన తెలివితక్కువతనానికి దొరగారు పెద్దప్రాణం బతికించేటప్పటికి పెద్దలు దిగొచ్చారటండి."

"ఇప్పుడుకూడా ఆ జిల్లాదొరగారినే తీసుకెళ్లగూడదూ ?"

"వారిదగ్గరకి వెళ్లివచ్చారటండి. వారు తాము చాలా తెలివైనవారనీ, తమను తీసికెళ్లవలసిందనీ సలహా ఇచ్చారటండి."

"సరే, నీవు వెళ్లు. నేను పిలుస్తాను."

బంట్రోతు అవతలికి వెళ్లిపోయినాడు.

ఏవూరు బదిలీ అయినప్పుడే ఇల్లాంటి దేదో సంభవిస్తుందని ఆమె అనుకోనే అనుకొన్నది. తాను వైద్యురాలు. వైద్యుల ముఖ్యవిధి రోగులకు సేవచేయడము. వారెవరైతేనేమిటి ?

కాని, వైద్యుడుమాత్రము మనుష్యుడు కాడా? అతనికి హృదయము, మనస్సు వుండదా ? అతని హృదయాన్ని కలతపెట్టే సంగతులు తారసిల్లవా ?— తాను ఆలోచించడానికికూడ వ్యవధి లేనేలేదు. భగవంతుడు ఈలాంటి అదను ఎందుకు సృష్టించాడో ? తనకూ, ఆ కుటుంబానికీ సంబంధము వదలిపోయి పదివేండ్లయింది. ఏది ఎందుకు వచ్చిందో ఏమి చెప్పగలము ? ఇదివరకు కన్న ఎక్కువ అవమానం జరుగుతుందా ?

ఒక్కసారి ఆమె గట్టిగా నిట్టూర్పు వదలింది. కన్నులు పూర్తిగా మూసుకొన్నది. పళ్లు బిగించి, కళ్లు తెరచి, బల్లమీద గంట కొట్టింది. పరుగున బంట్రోతు లోనికి వచ్చినాడు.

"నర్సును అన్ని పరికరాలతోనూ సిద్ధంకమ్మని చెప్పి, డ్రైవరే డ్రైవు చేయవలసి వుంటుందని నా ఆజ్ఞగా చెప్పు. ప్లీడరుగారిని ఈలా పిలు."

బంట్రోతు బయటికి పోయి సుందర్రావుగారిని లోనికి పంపించి, తాను డాక్టరమ్మగారి ఆజ్ఞలు నిర్వర్తించడానికి వెళ్లిపోయినాడు. సుందర్రావు లోనికి కంగారుతో ప్రవేశించి "అమ్మా, త్వరగా రావాలి. నేను రెండు జట్కాలనుకూడా తీసుకొనివచ్చాను." అని అన్నాడు. రంగుల కళ్లజోడు పెట్టుకొన్న డాక్టరమ్మ కొంచెము అస్పష్టధ్వనితో "సరే, మీరు వెళ్లండి. మీ వెంటనే నేను నాకారులో వస్తున్నాను. మా నర్సుకు మీయిల్లు తెలుసునట" అని ఇంగ్లీషులో చెప్పింది. సుందర్రావు వెళ్లిపోయినాడు.

సుందర్రావుగారి యింటిదగ్గిర ఆయనచుట్టాలంతా కంగారుపడుతున్నారు. సుందర్రావుజట్కాలు వచ్చి ఆగినవి. ఆవెంటనే డాక్టరమ్మగారి కారు వచ్చి ఆగింది. నర్సు, మంత్రసాని బంట్రోతుచేత సామానులు పట్టించుకొని ముందు నడవగా డాక్టరమ్మ పురిటింటిలోకి గబగబా వెళ్లిపోయింది. వెంటనే ఆమె సబ్బుతోనూ, లోషనునీళ్లతోనూ చేతులు కడిగికొని గడికిటికీలు బాగా తెరిపించి రోగితల్లినితప్ప తక్కిన వాళ్లనందరినీ బయటికి పొమ్మని రోగిని పరీక్షచేసింది.

రోగి అపరిమితంగా బాధపడుతోంది. చాలా నీరసంగా వుంది.

"నర్సు! ఇది ఫార్సిప్సుకేసు. నీవు క్లోరోఫారమ్ ఇయ్యి. మంత్రసానీ! పరికరాలన్నీ సిద్ధంచేయి..."అని డాక్టరమ్మ ఆజ్ఞచేసింది.

పదిహేనునిమిషాలలో పండులాంటి ఆడపిల్లను తల్లిగర్భకారాగారంలోంచి తీసి కేరుమనిపించింది. తల్లికి బలంకోసమని గ్లూకోజు నరాలద్వారా ఇంజక్షను ఇచ్చింది. మందులకు చీటీ వ్రాసియిచ్చి తాను చేతులు శుభ్రంచేసుకొని, నీలపు కళ్లజోడు సవరించుకొని, తల్లీ బిడ్డా క్షేమంగా వుంటారని తల్లితల్లికి ధైర్యము చెప్పి, తాను యింటికి పోయి మళ్లీ కారు పంపిస్తానని నర్సుతో చెప్పి యింటికి వెళ్లిపోయింది.

ఈడాక్టరు చాలా తెలివైనదనీ, ప్రజ్ఞావంతురాలనీ సుందర్రావుపెంపుడుతల్లి, అత్తగారు, మొగవారు, ఆడవారు అందరూ అనుకొన్నారు.

౨

డాక్టరమ్మగారిని ఎక్కడో చూచినట్లే వుందని సుందర్రావు ఆలోచన. ఆమెమాటలు చిన్న చిన్నవైన అభినయాదులలో సుందర్రావుకు ఏదో స్ఫురణ. ఆమె వెళ్లిపోయేటప్పుడు కృతజ్ఞత చూపడానికని సుందర్రావు ఆమెకు నమస్కారము చేస్తున్నప్పుడు, నీలపుకళ్లజోడు పెట్టుకొన్న ఆమెముఖముకూడా ఎక్కడో ఎప్పుడో ఎరుగున్నవారి ముఖములా తోచింది.

సుందర్రావు చాలా రూపుమారిపోయాడు. అతనికి నుదురుదగ్గరనుంచి సిగవరకు బట్టతలయింది. చుట్టూ గట్టుపోసినట్టుగామాత్రం జుట్టు వుంది. చిక్కిపోయినాడు. కళ్లు గుంటలుపట్టినవి. నుదురులో రేఖలు, కళ్లప్రక్క ముడతలు—రోగముపడి లేచిన మనిషిలా వుంటాడు. అదివరకే బానిసత్వస్వరూపమైన చూపు మరికొంత కాంతితగ్గి జడత్వము తాల్చింది. మనిషి గూనివానిలా కొంచెము ముందుకు వంగిపోయినాడు.

ఇవన్నీ ఆలోచించుకొంటూనే వెళ్లింది డాక్టరమ్మ. అతడంటే ఆమెకు ఎంతో జాలివేసింది. ఆమె ఎంతోసేపు నవ్వుకొంది. ఆనవ్వులో అర్ద్రత లేదు. ఏదో హాస్యము, ఏదో పాడితనముమాత్రము వుంది.

మరునాడు ఉదయాన్నే ఆస్పత్రికి వెళ్లబోయే ముందు సుందర్రావుయింటికి వచ్చి రోగిగదిలోకి తిన్నగా వెళ్లిపోయింది. డాక్టరమ్మ కులంచెడిపోకుండామాత్రము వుంటూవుందని యింట్లో ఎట్లా తెలిసిందో—బహుశా మంత్రసాని చెప్పివుండవచ్చు. ఈ డాక్టరమ్మదగ్గర మంత్రసానులూ, నర్సులూ వారికున్న

సహజమైన ప్రజ్ఞకన్న ఎక్కువప్రజ్ఞతో, ఎక్కువ శేముషీసంపన్నతతో సంచరించడము సాగించారు.

గది అతిశుభ్రంగా వుంచింది మంత్రసాని. తల్లీ, బిడ్డా పువ్వుల్లా పడుకొన్నారు. డాక్టరమ్మ రాగానే రోగి చిరునవ్వు నవ్వుతో ఆమెకు నమస్కారంచేసింది. "మీ మేలు ఎప్పుడూ మరిచిపోనండీ" అంది.

మంత్రసాని—ఇద్దరు బిడ్డలు పుట్టి పోయారటమ్మా.

డాక్టరమ్మ—భగవంతుని కృప వుండాలిగాని ఒకరు చేసేది ఏముందమ్మా.

ఈలాగు వారి సంభాషణ జరుగుతూండగానే వెంకాయమ్మ అక్కడికి వచ్చింది. "అమ్మా, మీవుపకారం ఎప్పటికీ మరవలే"మని డాక్టరమ్మకేసి తేరిపార చూసింది. ఏలాగైనా తెలివైనది గాబట్టి ఆమెమనస్సులో ఏదో మెరుపు మెరసిన ట్లయింది.

ఈ పదిసంవత్సరములలో వెంకాయమ్మ చిక్కిపోయింది. ఎప్పుడు ప్రవేశించిందో ఆమెకు రక్తహీనత—సన్నగిలిపోయింది. మొగము, ఒళ్లు పాండురమైపోయాయి. కళ్లల్లో నెత్తురుజీరలులేవు. పెదవులు తెల్లబడి ఒడిలిపోయినాయి. మొగము, కాళ్లు, చేతులు, మీగాళ్లు, మీదచేతులు వుబ్బి ఉన్నాయి. డాక్టరమ్మ వెంకాయమ్మకేసి నల్లద్దాల్లోంచే తీక్ష్ణంగా చూసింది. చేతులూ, కాళ్లూ చూసింది. ఆమెపెదవుల్లో అడగని ప్రశ్న ప్రసరించింది. వెంకాయమ్మ డాక్టరమ్మ అడగని ప్రశ్న గ్రహించింది. "నాకు రెండేళ్లనుంచి ఈ పాండురోగము ప్రవేశించి చాలా బాధపెడుతోందండీ. ఎన్ని మందులు వాడినా తగ్గడములేదు. గుండెల్లో దడ, ఏదో పెద్దదాన్నయాను—"

ఆమె కసికొద్దీ ఇంకా ఏవో మాటలు అందామనుకొంది. కాని అవి రాలేక గొంతుకలోనే వుండిపోయాయి. డాక్టరమ్మ సెలవు తీసుకొని వెళ్లిపోయింది. వెంకాయమ్మ ఎల్లాగ వెళ్లిందో లోపలికి వెళ్లిపోయింది. "అరే అబ్బాయీ, ఇల్లాగ రా" అని కేకవేసింది. "ఈ డాక్టరు నీ పెద్దపెళ్లామేరా" అని చెప్పింది.

"అదేకాబోలు. ఎక్కడో చూసినట్టు వుందని అనుకొన్నాను. ఇప్పుడు ఎల్లాగ?"

" ఎల్లాగేమిటి నీమొఖం! తెలివితక్కువ సన్నాసి! పెళ్లాన్ని తీసుకెళ్లి రాక్షసిచేతులో పెట్టావు. ఇంతవరకూ ఏదో జరిగిపోయింది. ఇక్కడినుంచైనా దాన్ని మానిపించేయి. మాలముండ. రంకుముండ."

ఎక్కడోవున్న ఏకొద్దిరక్తమో ఆమెముఖాన్ని చిమ్మింది. ఆమె నిలవలేక చతికిలపడింది. సుందర్రావు వెళ్లిపోయినాడు. అతని మనస్సు పరిపరివిధాల పారింది.

దద్దమ్మఅయిన సుందర్రావు లలితమ్మ వెళ్లిపోయిన కొన్నిరోజులదాకా ఆమెమాట చెప్పితే, ఆమె తలపుకు వస్తే మండిపోయేవాడు. తల్లితోపాటు ఆమెను ఎన్ని కారుకూతలు తిట్టాడో. ఎదుటపడితే నరికివేసేవాణ్ణే అనేవాడు. కాని ఆ వేడి చల్లారింది. ఎంత చచ్చయినా చదువుకొన్నవాడు, పురుషుడు. భార్యయొక్క అందం అతని కిష్టములేకపోయినా, ఎదుట ప్రత్యక్షమవుతోంది. ఆమెమంచితనం, ఆమెదీనదృష్టి, తన వంక చూచిన చూపులు, ఆమెతియ్యని కంఠం, ఆమె జ్ఞానసంపన్నత ఎట్టయెదుట కోరకుండానే ప్రత్యక్షమవుతుండేది. తనహృదయంలో ఎక్కడో రహస్యంగా తన పెంపుడుతల్లిదే తప్పని తోచింది. కోర్టులో, ఇతర చోట్ల తోడివకీళ్లు, చుట్టాలు తన్ను తలవాచేటట్టు పెట్టిన చివాట్లు తనను కలచివేశాయి. కాలం గడచిన కొలది భార్య వెళ్లి ఇంటరులో చేరిందని విన్నపుడు పెంపుడుతల్లిమీద అతిరహస్యంగా మండిపోయాడు. కాని మొట్టమొదటనుంచీ గట్టితనం లేనివాడు. జావకడివాడు. ఆశాహృదయం కలవాడు. పెంపుడుతల్లి యావదాస్తికీ సర్వహక్కులు కలిగింది. ఆస్తా, లక్షలు పెరిగింది. అది ఎల్లా వదలిపెట్టగలడు ?

ఒకనాటిరాత్రి బెదరిపోయిన లేడిలా బంగారు ఛాయగల లలిత తన ఒళ్లో తలపెట్టుకొని తన పాదాలు హృదయానికి గట్టిగా అదిమిపట్టుకొని మాటలులేకుండా వెక్కివెక్కి ఏడ్చింది. అప్పుడు తన కెంతో జాలివేసినమాట నిజం. అప్రయత్నంగా ఆమెతలను తడిమాడు తాను. కాని గోడలోంచీ, మూసిన తలుపు

ల్లోంచీ దివ్యదృష్టిచేత తన పెంపుడుతల్లి చూస్తుందేమోనని భయపడినాడు. పురుషుడైవుండీ పురుషత్వము లేని దద్దమ్మ.

## 3

తల్లి చెప్పినచొప్పున ఇక్కడనుంచి తనయింటి డాక్టరే వైద్యం చేస్తాడనీ, తాము రానక్కరలేదనీ డాక్టరు లలితమ్మగారికి సుందర్రావు వుత్తరము వ్రాసి, ఇది తమ ఫీజని పదిహేను రూపాయలున్నూ, నర్సు ఫీజని అయిదు రూపాయలున్నూ పంపించాడు. ఆ వుత్తరములోనే మంత్రసానికి మామూలు రేటయిన రోజుకు అర్థరూపాయి యిస్తానని వ్రాసినాడు. లలిత చిరునవ్వు నవ్వుకొన్నది. నర్సును, మంత్రసానిని పిలిచి పదిహేనురూపాయలు నర్సుకున్నూ, అయిదు రూపాయలు మంత్రసానికిన్నీ ఇచ్చింది. వాళ్లిద్దరూ సంతోషిస్తూ వెళ్లిపోయినారు.

కాని ఈ ఉత్తరము వచ్చిన మూడవనాటికి డాక్టరమ్మగారింటికి పరుపుపరువున సుందర్రావు రెండవ మామగారు రంగయ్య చక్కా వచ్చాడు. ఆయన వచ్చేటప్పటికి డాక్టరమ్మగారి యింటి హాలులో ఆమెతండ్రి కూర్చుని ఉన్నాడు. "ఎవరండీ బాబూ! కూర్చోండి" అని ఆయన ఈయనను మర్యాద చేసినాడు.

"డాక్టరుగారు మీ కేమవుతారండీ?"

"మా అమ్మాయండీ"

"తమరు బుచ్చివెంకయ్యగారా?"

"చిత్తం."

"ఛీ-చిత్తం- నా- నాపేరు రంగయ్యండి. చాలా అన్యాయం జరిగినమాట నిజమండీ. భగవంతుని చిద్విలాసము అల్లా వెళ్లిపోయిందండీ. ఇదంతా మా అక్కగారు వెంకాయమ్మగారి లోటు. ఆవిడ జీవితమంతా రాక్షసతనమేనండి. తమ అమ్మాయి పెళ్లిందగ్గరనుంచీ తన కొడుక్కు రెండవపెళ్లి రెండవపెళ్లని పరవళ్లు తొక్కిందండీ. రెండేళ్లు ఏ సంబంధమూ రాలేదు. మా అమ్మాయి ఎదిగి వుంది. నా కామె వేలు విడిచిన పినతల్లి కూతురండీ. నీ కూతుర్ని నాకొడుక్కిమ్మంది; లేకపోతే పస్తుపడుకొంటానంది. నాకప్పడున్న రెండు వేల రూపాయల ఋణం తీర్చేస్తానన్నదండీ. బీదవాణ్ణి, ఏం చేయను? ఆ రెండువేల రూపాయలకూ పిల్ల నమ్ముకొన్నాను. కాని, పెళ్లికి ముందర తన కోపం పూర్తిగా మా వెయ్యాలనీ, పిల్లను ఏమాత్రం అవమానంచేసినా లోకమంతటా తనయొక్క చరిత్రంతా డప్పుకట్టుకొని చాటిస్తాననీ బెదరించాను. పిల్ల ఏమాత్రం కష్టంపొందినా పిల్లను తీసుకురావడమే కాకుండా మాకూ, ఆవిడకూ వున్న చుట్టాలందరూ ఆమెగడప తొక్కకుండా చేస్తానని బెదరించాను. పిల్ల కాపరానికి వచ్చింది. ఇద్దరు పిల్లవాళ్లు పుట్టి పోయారు. ఇది మూడవకానుపండీ. తమ అమ్మాయిగారి కరుణవల్ల, చేతిచలవవల్ల మా అమ్మాయి సుఖప్రసవ మయిందండీ. పిల్ల కులాసాగా వుంది. కాని నిన్నరాత్రినుండి అమ్మాయికి నూటనాలుగు నూటఅయిదు డిగ్రీల జ్వరం వస్తూందండీ. ఎడమరొమ్ముమీద కురుపు వేసింది. ఒళ్లుతెలియదు. సంధో ఏమిటో బాబూ. ఆ ఒళ్లుతెలియనితనంలో "డాక్టరమ్మ, డాక్టరమ్మ, డాక్టరమ్మగారే బ్రతికించారు" అని ఒకటే పలవరింపు. మా అల్లుడు తీసుకొని వచ్చిన డాక్టరు రెండుమూడు ఇంజక్షనులిచ్చాడు. ఏమీ పనిజరగలేదండీ. ఆడాక్టరుగారు కూడా "ఆలేడీడాక్టరును తీసుకొనివచ్చి చూపించండి. అవసరమైతే నేను వుండనేవుంటాను" అని సలహాయిచ్చాడు. అమ్మాయిగారు ఆస్పత్రిలో ఉన్నారా, ఇక్కడ ఉన్నారాండీ? వారు పరీక్షప్యాసై ఆట్టే రోజులు కాలే దనుకొంటాను. కాని ఉత్తమఇల్లాలు కాబట్టి అంత చక్కని పేరూ, అంత చల్లని హస్తవాసిత్వమూ సంపాదించుకుంది" అని ఆయనకు ఆలోచనకు తావు ఇవ్వకుండా వుండేందుకున్నూ, ఇప్పుడు వుండే సంబంధబాంధవ్యాలు అందరికీ తెలియడముచేత లేడీడాక్టరు రారేమో అని భయముచేతను ఒక్కమ్మడి నుక్క త్రిప్పుకోకుండా మాట్లాడాడు రంగయ్యగారు.

బుచ్చివెంకయ్యగారు ప్రత్యుత్తర మిచ్చారు:

"ఈ వ్యవహారా లేమీ మా అమ్మాయిదగ్గిర తీసుకురా

కండి. మేము ఎవ్వరమూ వెంకాయమ్మగారి కుటుంబపు సంగతిగాని, సుందర్రావు పేరుగాని మా అమ్మాయి దగ్గిర తీసుకురాము. ఆ ఇల్లాలూ, ఆ ఇల్లాలి పెంపుడు కొడుకూ మా అమ్మాయిని ఎంత బాధపెట్టారోగాని ఊళ్లో వున్న పినతల్లిగారింటికి వెళ్లి అక్కడనుండి మొన్నాడు మావూరు వచ్చేసింది. కర్రబారిపోయింది. మాకుటుంబమంతటిలోనూ తన అత్తగారి యింటిసంగతి తీసుకురావద్దనీ, లేకపోతే తన ప్రాణానికి ఆశవదలుకోవాలనీ నిశితంగా, దృఢంగా చెప్పింది. ఆ మరుసటి సంవత్సరము మదరాసులో ఇంటరుమీడియేటులో చేరి మొదటితరగతిలో మొదటిదిగా కృతార్థురాలైంది. పిమ్మట మెడికలు కాలేజీలో చేరింది. అందులోనూ ప్రతిసంవత్సరమూ మొదటి తరగతిలో నెగ్గింది. ఆఖరు సంవత్సరము మొదటితరగతిలో రెండవదిగా కృతార్థురాలైంది. ప్రభుత్వమువారు అసిస్టెంటు సర్జనుగా ఉద్యోగం యిచ్చారు. ఏడాదిపాటు మెటర్నిటీ ఆస్పత్రిలో ట్రెయినింగై పరీక్షప్యాసై నెల్లూరులో అసిస్టెంటు సర్జనుగా చేసి ఇక్కడకు వచ్చింది. ఈ పది ఏళ్లూ ఒక్కసారైనా ఆమెగాని, మేముగాని వెంకాయమ్మగారి కుటుంబముసంగతి ఎత్తలేదు. నేనూ, నా భార్యా ఆమె మెడికలుకాలేజీలో చేరినప్పటినుంచీ వెంటనే వుంటున్నాము. తన చదువేమో, తన ఉద్యోగమేమో మరి ఇంకేమీ లేదండి. అమ్మాయి ఇంట్లోనే వుంది. భోంచేస్తూంది. ఇప్పుడే వస్తుంది."

ఇంతట్లోనే భోజనము చేసి డాక్టరు లలితమ్మగారు యివతలకి వచ్చారు. ఆమె రాగానే ఆమెతో రోగిసంగతులన్నీ మనవిచేశారు రంగయ్యగారు.

లలిత—అయ్యా, నేను కొత్తగా ఉద్యోగంలోకి వచ్చాను. ఊళ్లో యితర డాక్టరులు వుండగా గవర్నమెంటు డాక్టరులు ప్రయివేటువైద్యం చేయగూడదు. జిల్లాడాక్టరుగారు ఆజ్ఞ ఇవ్వడముచేత నేనంతవరకైనా సహాయము చేశాను. డాక్టరులలో మర్యాదలున్నాయి. మే మామర్యాదలను ఏమాత్రమూ అతిక్రమించడానికి వీలులేదు. మీ కుటుంబపు డాక్టరుగారు మీ అమ్మాయికేసు తీసుకొనివచ్చి ఆస్పత్రిలో చేర్పి నావార్డులో ప్రవేశపెడితే నేను వైద్యంచేయవలసి వుంటుంది గాని, జిల్లా డాక్టరుగారి అనుమతి లేనిదే నేను మీ ఇంటికి రావడానికి వీలులేదు. తరువాత మీ ఇష్టం.

రంగయ్య — అమ్మా, రోగి సంధిలో నీ పేరు నిమిషానికి పదిసార్లు తలుస్తుంది. అదే రామనామస్మరణ ఐపోయింది. అమ్మా, ఎల్లాగు రక్షిస్తావో. పెద్దవాణ్ణి. తమ పాదాలు పట్టుకొంటాను.

లలిత—అయ్యా, ఈసంగతులన్నీ చెప్పి జిల్లా డాక్టరుఆజ్ఞ తీసుకొనిరండి. నేను సాయంత్రము వచ్చి వైద్యం ప్రారంభిస్తాను. సెలవు.

అని లోపలికి వెళ్లిపోయింది.

రంగయ్యగారు నిస్పృహతో, గుండెదడతో యింటికి వెళ్లిపోయాడు.

## ౪

డాక్టరు లలిత ఆసాయంత్రమునుంచి సుందర్రావుగారి భార్యకేసు మళ్లీ తీసుకొంది. రోగి నీళ్లాడి కొద్దిరోజులైంది. పథ్యమున్నా పెట్టలేదు. ఎడంరొమ్ముమీద కురుపు. బాలింతజ్వరం అని ఇదివరకుడాక్టరు సెప్టిసీమిక్, స్ట్రెప్టోకోకస్ సీరమ్ రక్తనాళంగుండా యింజక్షను లిచ్చాడు. జ్వరం తగ్గలేదు. లలిత వచ్చింది. కూడా నర్సును తీసుకొని వచ్చింది. పదినిమిషాలు యితరమైన సర్వమూ మరచి ఆలోచించుకొంది. ఆమెమనస్సులో మెరుపు మెరసినట్లయింది. పద్నిగెయినులు ౫ సి. సి. లో వున్న క్వినైనుమందున్నూ, ౫ సి. సి. గ్లూకోజున్నూ కలిపి రక్తనాళంగుండా ఇంజక్షను యిచ్చింది. ఆమందుయొక్క గుణం చూచేవరకూ అక్కడనుంచి కదలగూడదని అక్కడనే మకాంపెట్టింది. ఆరుగంటలకు ఇంజక్షను యిచ్చింది. నెత్తిమీద ఉడుకులాంగుడ్డలు వేయించింది. ఎనిమిదిగంటలకు జ్వరం తగ్గడం ప్రారంభించింది. పదింటికి చెమటలు పోసి రోగికి మెలకువ వచ్చింది. నూటఅయిదుడిగ్రీల జ్వరం నూరుడిగ్రీలకు దిగిపోయింది. తనకు సరియైన ఔషధాభిప్రాయము కలిగినందుకు లలిత భగవంతునికి మనస్సులోనే కృతజ్ఞత తెలుపుకొంది.

రోగి కన్నులు తెరచి "అమ్మా, మీరే వచ్చారా? ఇక నాకు ఫర్వాలేదు" అన్నది. లలిత రోగినుదుటి మీద వున్న ఉడుకులాం తీసివేసి అక్కడ వున్న పొడితువాలుతో తుడిచి, పాపిడి, జుట్టు సరిచేసి "కొంచెము కాఫీ త్రాగుతావా" అని అడిగింది. రోగి తల ఊపింది. రోగితల్లితో "కొంచెము కాఫీ తెప్పించం" డనీ, పంచదారబదులు గ్లూకోజు వేయమనీ చెప్పి, రోగితో ఈ కబురూ ఆ కబురూ మాట్లాడడము ప్రారంభించింది. రోగి చిరునవ్వు నవ్వుతూ డాక్టరమ్మకబుర్లన్నీ వింటున్నది. కాఫీ త్రాగి రోగి నిద్ర పోయింది. లలిత నర్సును ఆమె యింటిదగ్గర దిగబెట్టి తన యింటికి వెళ్లిపోయింది.

లలిత భర్తయిల్లు వదలినప్పటినుంచీ భర్తను వదలిన విచారము ఏమాత్రమూ పడలేదు. చదువుకొన్న ఎనిమిది సంవత్సరములలో ఎన్నిసార్లో భర్తను గురించి ఆలోచించుకొన్న మాట నిజమే. భర్తకు మళ్లీ పెళ్లయిందని విన్నది. "అమ్మయ్య! కొంత బాధ వదలిం" దని అనేకసార్లు అనుకొన్నది.

ఆమెహృదయం భార్యాత్వాన్ని మించి పైకి పోయింది. ఆమెలో స్త్రీత్వం పోయిందని కాదు. ఆ రోజులలో ఆమెకు స్త్రీత్వం ప్రత్యక్షమే కాలేదు. తన తోడివిద్యార్థులైన అందమైనట్టి తెలివైనట్టి బాలకులు తనతో మాట్లాడినప్పుడూ, తన్ను తారసిల్లినప్పుడూ అవ్యక్తమై స్త్రీస్వాభావికమైన ఏదో ఒకరకమైన ఆనందం పొందింది. అంతకన్న వేరభిప్రాయాలు లేవు. భర్తతో తా ననుభవించిన సంపర్కసౌఖ్యాలను ఆమె సంపూర్ణముగా తనలోనుంచి పారదోలగలిగింది.

తాను కాపరానికి వచ్చినప్పటికి ప్రేమ అనేది ఆమె ఎరగదు. సాధారణ హిందూబాలిక ఏబాలికయినా గాఢమైన స్త్రీ పురుషప్రేమ కాపరానికి వచ్చినప్పటికి భావించివుండదు. అది భార్యాభర్తలు కలిసితిరగడంలో, స్నేహంలో వుంటుంది. లలిత అలాంటి స్నేహంగాని, అలాంటి ఆనందంగాని భర్త విషయంలో ఎప్పుడూ అనుభవించలేదు. కోపము, భయము, ఓపిక, దుఃఖము అనేవితప్ప ఆమె ఇంకో గుణాలు ఎరగదు. పదిహేడు ఏండ్ల బాలికలో స్త్రీత్వం ఏమాత్రం విజృంభించివుంటుంది? ఈనాడు సంపూర్ణాంగిరైన ఉజ్జ్వలపూర్ణయౌవనాంగి, యిరువది ఏడేండ్ల స్త్రీ.........

సుందర్రావు పెద్దభార్యను చూచాడు. రెండవ భార్య ఎప్పుడూ అందమైంది కాదు. అతనికి ప్రథమ భార్యతో సమాగమము దొంగతనపుసొత్తు అనుభవించుచున్నట్లుగానే వుండేది. లలితలో ఆసమయాల్లో యౌవనము పొంగేదికాదు. స్త్రీ పురుషస్నేహము వాంఛించే రోజు లవి. అత్తగారిచ్చే దుఃఖానికి ఏదో కొద్ది విరుగుడుగా భర్తను వాంఛించేది. ఆకోలదివాంఛ ఆమెకు ఏమాత్రమూ తృప్తి నిచ్చేదికాదు. పెంపుడుతల్లి భయాన సుందర్రావు భార్యతో తిన్నగా మాట్లాడనైనా మాట్లాడేవాడు కాడు. అతడు దొంగతనంగా భార్యనెప్పుడైనా కాంక్షిస్తే ఆ కాంక్షను లలిత తన భార్యాత్వపు విధిక్రింద పరిపాలించేదికాని స్త్రీయై ఎప్పుడూ పరిపాలించి యెరుగదు.

నేడు సుందర్రావుకు పెద్దభార్య అందరాని కొండయింది. ఆమెలో సౌందర్యము పాలవెల్లువలా వుప్పొంగిపోతున్నది. భార్యను చూచి సిగ్గుపడి చచ్చి ఏదో అధోలోకానికి పోయినాడు. ఆమెతో మాట్లాడడానికైనా ధైర్యము, తాహతు చాలలేదు. ఆమె దుర్నిరీక్ష్య ప్రభాభాసితమైన దేవీస్వరూపములా వెలిగిపోతున్నది. ఇంతకాలమూ తనకు ఆమె కానిదైపోయిందని వుడుకుబోతుతనం పొందాడు. కోపం పొందడానికి శక్తిలేదు.

నాలుగురోజులలో రోగిణైన లక్ష్మీదేవికి పథ్యము పెట్టినారు.

పథ్యంపెట్టిన రెండవరోజున డాక్టరు తన మామూలుపద్ధతిని సాయంత్రము నాలుగుగంటలకు ఆస్పత్రికి వెళ్లబోయేముందు సుందర్రావుగారింటికి వచ్చి రోగితో కబుర్లు చెబుతూ కూర్చునివుంది.

రోగికి మళ్లీ జబ్బుజేసి విపరీతమైన జ్వరం వచ్చి సంధిమాటలలో డాక్టరమ్మ డాక్టరమ్మ అని కలవరించే

టప్పుడుకూడా తన పెద్దకోడలిని వైద్యానికి తీసుకొని రాకూడదని వెంకాయమ్మ పెంకిపట్టు పట్టింది. ఆపాడు ముండ తన గడప తిరిగి తొక్కకూడదంది. ఇంటిలో అందరూ కూడా ఆమెను బతిమాలారు. రోగియొక్క స్థితి అంతకంతకును మితిమీరిపోయింది. అంతతో రంగయ్యగారికి పట్టరాని కోపము వచ్చింది. వెంకాయమ్మను తలవాచేటట్టు చివాట్లు పెట్టాడు. "ధనాని కాసపడి, ఆస్తి కాసపడి, శుద్ధబుద్ధిహీనుడనై నీకొడుక్కు నాకూతుర్నిచ్చుకొని గంగలో పడ్డాను. చస్తే చచ్చింది, నా కూతుర్ని తీసుకొనివెళ్లి ఆడాక్టరవ్మకాళ్లమీద పడవేస్తాను." దద్దమ్మలా కూర్చునివున్న అల్లుని వైపు తిరిగి "ఏమయ్యా, నీవు ఇంకా ఎన్నాళ్లు పెంపుడుతల్లి కొంగుచాటున దాక్కునివుంటావు? మొగతనం లేక బంగారములాంటి భార్యను అవతలకి తోసేస్తివి. ఇవ్వాళ మళ్లీ ఆడుదానికన్న అధమాధమముగా నోట మాటరాకుండా కూర్చుంటావు. నీకేం, ఈ పెళ్లాం పోతే ఇంకోపెళ్లాం వస్తుంది"అని కేకలువేశాడు.

ఈమాటలతో తల్లీకొడుకు లిద్దరూ హడలిపోయినారు. వెంకాయమ్మ గజగజలాడిపోయింది. సుందర్రావు మొగము వెలవెలలాడిపోయింది.

ఈవిషయాలన్నీ తలచుకొంటూ వెంకాయమ్మ పెద్దకోడలూ, చిన్నకోడలూ పురుటిగదిలో నవ్వుతూ కులాసాగామాట్లాడడము చూచింది. ఆమెఒళ్లూమనస్సూ చీమలూ, జెర్రులూ ప్రాకినట్టయిపోయింది. ఆమెలోని మహాక్రోధమంతా ఒక్కసారి వెల్లివిరిసిపోయింది. పళ్లు పటపట కొరుక్కుంటూ కోర్టునుంచి పెందలకాడే వచ్చిన కొడుకుదగ్గరికి పోయి "ఏమిరో వాజమ్మా, నీకు ఆ రంకుముండమీద మనస్సు పోయిందా? నిమ్మదించిందిగా జబ్బు? అందరూ నాడబ్బు తినాలని ఏడ్పే వెధవలే. నీకోసమే ఎప్పుడూ పడని అవమానాలు పడుతున్నాను. నే చస్తే మీఅందరికీ కర్మం విరగడై పోతుంది"అంది. చూస్తూచూస్తూ ఆమెనల్లగుడ్లు వెనక్కి తిరగబడ్డాయి. గబుక్కున కూలి చెట్టు విరుచుకొని పడినట్లు పడబోయింది. "అదేమిటే అమ్మా, అమ్మా" అని సుందర్రావు తల్లిని పట్టుకొన్నాడుగాని లేకపోతే వెంకాయమ్మబుర్ర బద్దలయ్యేది. "మామయ్యో, మామయ్యో, మాఅమ్మ చచ్చిపోతోం" దని ఒకపొలికేక పెట్టాడు. తల్లిని చంటిబిడ్డలా ఎత్తుకొని తీసుకొచ్చి హాలులో మంచముమీద పడుకోబెట్టి పురుటి గది సమ్మంలోకి వచ్చి "డాక్టరుగారూ, మాఅమ్మచచ్చిపోతోంది, ఒక్కసారి చూడండి" అని వణుకుతో మాట రాక సగముగా అన్నాడు. లలిత చివాలున లేచి రోగిదగ్గిరికి వచ్చి రోగినాడి పరీక్ష చేస్తూ పురిటిగదిలో నున్న మంత్రసానిని తన అర్జంటు మందులు పెట్టిన పెట్టెను తెమ్మనీ, గ్లూకోజు ఇంజక్షను తొందరగా ఇవ్వమనీ ఆజ్ఞ యిచ్చింది. ఈలోపుగా వెంకాయమ్మ పడుకున్న మంచం పీటలు ఎత్తిపెట్టమని ఆజ్ఞ యిచ్చింది. గ్లూకోజులో చాలా కొద్ది ఎడ్రినాలిన్ కలిపి వెంకాయమ్మ స్తనముల క్రింద కండరములలో ఇంజక్షను యిచ్చింది. నాడి కొంచెం గట్టిపడింది. మళ్లీ కొంత గ్లూకోజు రక్తనాళముల ద్వారా ఇంజక్షను యిచ్చింది. ఆ పట్టుపట్టు రోగికి రెండు గంటలకు మెలకువ వచ్చింది. కాని వెంకాయమ్మ అతి నీరసపడిపోయి సంపూర్ణ స్పృహలోకి రానేలేదు. రంగయ్యగారే భారమంతా తన నెత్తిమీద పెట్టుకొని తన కూతుర్ని రక్షించినట్లుగానే తన వియ్యపురాలినికూడ రక్షించవలసిందని లలితమ్మను అతి వినయంగా ప్రార్థించాడు.

"ఈమెకు సంపూర్ణంగా తెలివొచ్చేవరకూ నేను వైద్యం చేస్తాను. ఇది గడ్డుఅయిన పాండురోగము. చాలాకాలం అశ్రద్ధ చేశారు. ఒంట్లో రక్తం ఏమాత్రమూ లేదు. రోగికి పూర్తిగా మెలకువ వచ్చిన తరువాత ఆమెయిష్టముపైనగాని నేను వైద్యము చేయడానికి వీలులే" దని అన్నది లలిత.

సుందర్రావు కృతజ్ఞతాపూర్వకమైన చూపులతో తల వాల్చుకొన్నాడు. రంగయ్య "చిత్తమమ్మా, ఆలాగే చేయించండి" అని అన్నాడు. డిజెటాలిన్, డైయూర్టిన్, కాంపోలాన్, గ్లూకోజు అనే మందులు ఆమెకు ఉపయోగించడము మొదలుపెట్టింది. గుండె బలపడింది. ఒంట్లో వున్న నీరంతా అధికాచమానం ద్వారా వెళ్లిపోయింది. అక్కడనుంచి ఒక్క కాంపో

లాన్ మాత్రము నడుపుతూ లోపలికి హిపాటిక్సు అనే పైత్యకోశపుమందు యిచ్చే ఏర్పాటు చేసింది.

లలిత వైద్యం ప్రారంభించిన నాలుగోరోజుకు ఒంట్లో జవసత్తువులు చేరి వెంకాయమ్మకు పూర్తిగా మెలకువ వచ్చింది. గుండెల్లో దడ తగ్గడం, కాళ్లలో, చేతులలో, మొహంలో వున్న నీరు తగ్గిపోవడం, కొంచెం ఒంట్లో తనకు ఆరోగ్యంగా ఉండినట్లు తనకు తోచడం ఆమె మాచింది. ఈ రాక్షసిచేత తనకు వైద్య మేమిటని తనకు అప్పుడప్పుడు వుద్భవిల్లిన ఆలోచనలు అక్కడక్కడే చంపివేసుకొంది. లలిత వైద్యానికి వచ్చినపుడల్లా తనకు ధైర్యము వచ్చిన ట్లయ్యేది. లలితమ్మవైద్యం తాను ఒప్పుకొంది. వైద్యం సాగింది. నానాటికీ వెంకాయమ్మ దృఢగాత్రురాలు కాసాగింది.

## ౬

పెద్దభార్య తన చిన్నభార్యకూ, తన తల్లికీ సర్వకాలహాసపంపూర్ణ వదనయై వైద్యము చేస్తూ వుండడము సుందరరావుకు ఆశ్చర్యము వేసింది. భార్యతో పరాయిలేడీడాక్టరుతో మాట్లాడినట్లయినా మాట్లాడదామని ప్రయత్నించాడు. లాభం లేక పోయింది.

లక్ష్మీదేవిచంటిబిడ్డ ఎంతో కులాసాగా వుండడమూ, లక్ష్మీదేవి డాక్టరమ్మ వచ్చేటప్పటికి ఆమెను ప్రత్యక్షమైన దేవిలా చూడడమూ ఇదంతా సుందరరావు చూస్తూనేవున్నాడు. ఆమెకుమాత్రం తనకు వైద్యంచేసే వైద్యురాలు తన సవతేనని ఎంతమాత్రమూ తెలియదు. తెలిస్తే ఆమె ఏమనుకుంటుందో అని అతడనుకొన్నాడు. రెండవభార్యతో డాక్టరు లలితమ్మ సంగతి చెప్పి ఆమె పొందే భావాలను చూడాలని ఒక కల్మషమైన కోరిక కలిగింది సుందరరావుకు. మళ్లీ తప్పనుకొన్నాడు. మళ్లీ ఆ ఆలోచనకు లోనయిపోయినాడు. చిన్నగా లక్ష్మీదేవి దగ్గరకు వెళ్లినాడు.

"నాప్రథమవివాహముసంగతి నీకు తెలుసును కదూ?"

"ఆ, అంతా తెలుసును"

"ఏం తెలుసును?"

"అత్తగారు పెట్టే బాధలు పడలేక పుట్టింటికి వెళ్లిపోయి డాక్టరుపరీక్షకు చదివి ప్యాసై ఉద్యోగము చేస్తున్నదని"

"నీకు వైద్యంచేసే డాక్టరుగారి సంగతి ఎరుగుదువా?"

"ఆ, ఎరుగుదును. ఆమె మీ పెద్దభార్య"

సుందరరావు తెల్లబోయాడు. అతని హృదయం కాలీ అయిపోయింది.

భర్త తెలా వెలా పోవడము చూచి లక్ష్మీదేవి "మానాన్నగారు అన్నిసంగతులూ చెప్పారు" అన్నది. సుందరరావు అక్కడనుంచి వెళ్లిపోయినాడు. లక్ష్మీదేవిహృదయము ప్రాథమికస్థితిలోనే వున్నది. ఆమెకు వస్తే కోపము, లేకపోతే దయ. భర్త అలా వచ్చి ఎందుకని వెళ్లిపోయినాడో ఆమెకు అర్థము కాలేదు. డాక్టరు యిష్టపడి మళ్లీ కాపురముచేయడానికి ఒప్పుకుంటుందా? తనకన్న అందంగా వుంది. మంచి ఉద్యోగం చేస్తున్నది. ఆమెను తీసుకొనిరావడానికి భర్త ఆశపడుతున్నాడా? డాక్టరమ్మ తన యింటికి తిరిగీ కాపరానికి రావడానికి ఎందు కిష్టపడుతుంది? తనకు ఈగొడవ లేమీ తెలియవు. డాక్టరమ్మ చాలామంచిది. ఆమె దేవతామూర్తి. ఆమెకు మాత్రం భర్త అవసరంకాదా? భర్త ఎంత దుష్టుడైనా, అత్తగా రెంతటి దుర్మార్గురాలైనా ఒకస్త్రీ చేసే కాపరం చేతులారా తోసివేసుకొని తన యిష్టమువచ్చినట్లు వెళ్లిపోవచ్చునా? తన తండ్రి తన భర్తను, అత్తగారిని ఎన్నివాగ్దానాలు తీసుకొని తన పెళ్లికి ఒప్పుకోలేదు? అలాంటప్పుడు తన అత్త, భర్త తన్ను రాసి రంపాన్ని పెడితే తాను పుట్టింటికి పారిపోతుందా? బాధలు పడుతూ అత్తవారింటిదగ్గరే వుంటుందా? ఉత్తమ ఇల్లాలు బాధలన్నీ పడుతూ ప్రాణాలన్నీ అర్పిస్తుంది గాబోలు. కోడరికాలు భరించలేక ఎంతమంది పతివ్రతలు నూతుల్లోనూ, చెరువుల్లోనూ, కాలవల్లోనూ పడి ప్రాణాలు

తీసుకోలేదు? అందరూ అత్యుత్తమపతివ్రతలైతే సీతను, సావిత్రిని చూపించడ మెందుకు? ఈ ఆలోచనలే భరించలేక లక్ష్మీదేవి ఎదుట గోడమీద వున్న సీతారామలక్ష్మణహనుమంతులున్న పటానికి నమస్కారంచేసి బిడ్డకు పాలివ్వడము మొదలుపెట్టింది.

వెంకాయమ్మ తన పెద్దకోడలిచేత వైద్యము చేయించుకోవడానికి ఎందుకు ఒప్పుకుందో తెలియక సుందర్రావు, రంగయ్యగార్లు ఆశ్చర్యపడ్డారు. ఈ విషయం వెంకాయమ్మగారికిమాత్రం ఏం తెలుసును? కసికొద్దీ రాక్షసై కోడలుప్రాణం తీసేస్తుం దని భయపడిందా? డాక్టరురుసుము, కోడలవడముచేత, పుచ్చుకోదని ఆశపడిందా? ఈవైద్యం జరుగుతూ ఆరోగ్యం పొందుతున్నకొలదీ వెంకాయమ్మలో ఏదో వర్ణింపరాని మార్పు రాసాగింది. డాక్టరు వచ్చేటప్పటికి ఎంతో గౌరవముచేసి కుర్చీ వేయించి మర్యాదచేసేది. ఒక్కనాడుకూడ తమ ఇరువురి వెనకటిచుట్టరికమును జ్ఞాపకంతెచ్చే సంగతి ఒక్కటిగూడ ఆమె తీసుకొని రాలేదు. లలితమ్మ వచ్చేటప్పటికి ఆమెముఖము కలకలాడేది. లలితమ్మ వెళ్లినదగ్గరనుంచి ఏదో పరధ్యానములో వుండేది. ఆ ఊళ్లో వున్న ఒక పండితుని తనకు ప్రతిదినమూ భారత, భాగవత, రామాయణగ్రంథములను చదివి వినిపించి అర్థంచెప్పడానికని ఏర్పాటు చేసుకొంది. కొడుకును, రంగయ్యగారిని ప్రతివిషయానికీ పిలిచి ఆలోచించసాగింది. నెమ్మదినెమ్మదిగా తాళపుచెవి కొడుక్కు యిస్తూండడమూ, ఇంతడబ్బు తీసుకురా అంతడబ్బు తీసుకురా అని చెప్పడమూ చేయసాగింది. ఒకరోజున బండి చేసుకొంది. తిన్నగా డాక్టరు లలితయింటికివెళ్లింది. లోపలికి పోయి వియ్యపురాలికాళ్లమీద పడి "అమ్మా, నన్ను క్షమించు. నేను నీ కుటుంబానికీ, లలితమ్మజీవితానికీ రాక్షసినై, పెనుభూతానైన్నిమహాకష్టముతీసుకొనివచ్చాను. లలితమ్మ అపరదేవత. నా యావదాస్తిని లలితమ్మకు రాసియిస్తాను. ఆమె నాజీవితానికి ఏమిప్రాయశ్చిత్తము వినియోగిస్తే అది నిర్వర్తిస్తాను" అని వెక్కివెక్కి ఏడుస్తూ ఆమె కాళ్లు వదిలిందిగాదు. లలితమ్మకళ్లి తెల్లబోయింది. ఆమె ఏమి చెప్పగలదు? ఆమెకు కళ్ల నీళ్లు తిరిగాయి. "నేను నా పెద్దకోడలి కాళ్లమీద పడి ఆజన్మాంతమూ క్షమించమని కోరుచున్నా నని చెప్పవలయును" అని అన్నది. ఆ స్తివిషయమై తాను ఆడిన మాటలు అమ్మాయితో మనవి చేయవలయు నని ప్రార్థించింది.

౭

ఆ మర్నాడు రాత్రి ఎనిమిది గంటలకు సుందర్రావు డాక్టరు లలితాదేవి యింటికి వచ్చాడు. లలితా సుందర్రావుల చరిత్ర నెమ్మదినెమ్మదిగా లోకమంతా తెలుసుకోనే తెలుసుకొంది. లోకమంతటా వీరి సంగతి పాకిపోయింది. సుందర్రావుగారు రాగానే బంట్రోతు హాలులో వున్న కుర్చీలో కూర్చోమని, లోపలికి వెళ్లి బుచ్చివెంకయ్యగారితో "సుందర్రావుగారు వచ్చారండి" అని చెప్పాడు. వెంకయ్యగారు 'ఈ గొడవ ఏమిట్రా బాబూ' అనుకొంటూ హాలులోకి వచ్చాడు. మామగారు రాగానే సుందర్రావు లేచి నమస్కారం చేశాడు. చేసి తల వాల్చుకొని ఆలాగే నిల్చుండిపోయినాడు. బుచ్చి వెంకయ్యగారు 'కూర్చోండి' అని, సుందర్రావు కుర్చీమీద కూర్చుండగానే తాను కూర్చున్నాడు. సుందర్రావు కళ్ల నీళ్లు కారిపోతూవుండగా తల వాల్చుకొని కూర్చునివుండి కాలి బొటనవ్రేలితో తివాచీని వ్రాయసాగినాడు.

బుచ్చి వెంకయ్యగారు ఏం మాట్లాడగలరు? "ఇంటిదగ్గిర తల్లీ, పిల్లా కులాసాగా వున్నారా?" అని మాత్రము ప్రశ్నించాడు. సుందర్రావు తల వూపాడు.

తర్వాత ఏలాగో సంబాళించుకొని తల వాల్చుకొని "ప్రపంచంలో నాబోటి దురాత్మగ్నుడు లేడు. పరీక్షలు ప్యాసవడము నాలోని పశుత్వాన్ని ఎక్కువ చేసింది —" అని ఆగిపోయాడు.

బుచ్చివెంకయ్యగారు 'ఏదో వస్తోందిరా బాబూ' అనుకొన్నాడు.

"మీ రందరూ నన్ను క్షమించడానికికూడా నేను అర్హుణ్ణి కాను. మీ రందరూ నన్ను క్షమించారంటే అదే నాకు పదివేలు."

బుచ్చివెంకయ్యగారు "ఎవరు ఎవరిని క్షమించగలరు నాయనా? అందరినీ క్షమించేందుకు, ప్రేమిం

చేందుకు, రక్షించేందుకు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు. మనకు వచ్చే కష్టాలు, సుఖాలు మన కర్మనుబట్టి వుంటవి". అని నెమ్మదిగా చెప్పినాడు.

వారిద్దరిమధ్య మౌనము తెరలై వాలింది. ఏలాగైతేనేమి, సుందర్రావు ధైర్యము తెచ్చుకొని "నా క్షమార్పణ ఆమెకుగూడ స్వయంగా చెప్పుకొని వెళ్లిపోతాను" అన్నాడు.

బుచ్చివెంకయ్యగారు పదినిమిషములు ఆలోచించి లోపలికి వెళ్లిపోయినాడు. లలిత తాను చదువుకొనే గదిలో బల్లమీద ఎలెక్ట్రిక్‌స్టాండు వెలుతురులో 'బ్రిటిషు మెడికల్ జర్నలు' అనే ఒక ఇంగ్లీషు వైద్యపత్రికను చదవడానికని తీసి ఏదో పుటను తీసి ఆపుటలో విషయాలమీద ఏమాత్రమూ దృష్టి లేక తల్లివల్ల అత్తగారి రాకసంగతి ఎరుగున్నది కాబట్టి ఆ ప్రకరణంలో ఇది భాగమని అనుకొంటూ, ఆలోచించుకొంటూ వున్నది. ఇంతలో తండ్రి వచ్చి "అమ్మాయీ, నిన్ను క్షమార్పణ అడగాలని అంటున్నాడు. ఏం చెప్పమన్నావు?" అని అడిగినాడు.

రోగిని చూసి రోగిసంగతి, వైద్యంసంగతి నిశ్చయించుకొన్నట్లుగా లలితమ్మ అయిదునిమిషము లేదో ఆలోచించుకొని హఠాత్తుగా లేచింది. "నాన్నా, నేను వెళ్లి మాట్లాడివస్తాను" అని చెప్పింది. "నేను ఒక్కర్తెనే వెళ్లివస్తా"నని తండ్రితో చెప్పి హాలులోకి వెళ్లింది.

లలితమ్మ రాగానే సుందర్రావు లేచి నమస్కారము చేసినాడు. అతని కళ్లవెంట అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. లలితమ్మ అతనిని కూర్చోమని సైగచేసి తానును తన తండ్రి కూర్చున్న కుర్చీలోనే కూర్చున్నది.

ఆ హాలు అతిసుందరముగా అలంకరింపబడి ఉన్నది.

సుందర్రావు వేరే మాట్లాడలేక కళ్లనీళ్లు ఆపుచేసుకొని తల వాల్చుకొనేఉన్నాడు.

హాలులో గడియారము ఎనిమిదిన్నర కొట్టింది.

లలితమ్మకూడా ఏమీ మాట్లాడలేదు. గోడమీద అలంకరింపబడివున్న చక్కని చిత్రలేఖనములు ఈదంపతుల నిరువురిని చూస్తున్నట్లున్నవి.

సుందర్రావు తన జేబులోని ఉత్తరమును తీసి "న-న్ను-మీ-రు-క్ష-మిం-చాలి" అని అంటూ ఆ ఉత్తరము తీసుకొనివచ్చి ఆమెబల్లమీద వుంచినాడు. తాను వెళ్లి యథాస్థానమున నించున్నాడు. లలితాదేవి భర్తను చూస్తూ "మీరు కూర్చోండి" అని అన్నది.

మళ్లీ మౌనదేవతే తాండవము చేసినది. సుందర్రావు లేచి నమస్కారముచేసి సెలవుతీసుకొంటానని చెప్పి గబగబ వెళ్లిపోయినాడు. లలితమ్మకంటిలో రెండుచుక్కలు గిర్రున తిరిగినవి.

౮

లలిత అక్కడనే భర్త అందించిన కవరు తీసి దాని పైఅడ్రసు చదువుకొన్నది. "డాక్టరు లలితాదేవి, యమ్.బి.అండ్ బి.యస్.,అసిస్టెంటు సర్జను,ఏలూరు." అని ఇంగ్లీషులో ఉన్నది. కవరు నెమ్మదిగా విప్పి లోని కాగితాలు పైకిలాగగానే ఐదు వేయిరూపాయల నోట్లును, రెండు ఉత్తరములును కనపడినవి. ఆమె తెల్లబోయి ఆనోట్లేమిటో అర్థంచేసుకోలేకపోయింది.

"శ్రీ లలితాదేవీ!

మనుష్యులు చేసే కొన్ని పాపాలకు నివృత్తి లేదు. నేను చిన్నతనాన్నించి దద్దమ్మను. చదువుకొన్న మూర్ఖుణ్ణి. ధనానికి ఆసించిన పాపిని. నేను మిమ్ములను క్షమించమని అడగడానికికూడ అర్హుణ్ణి కాను. మీరు ఏలూరు రావడమువల్ల నేనూ, మా అమ్మ ఇదివరకు మిమ్మల్ని పెట్టిన బాధలకు కలిపి యింకా ఎన్నో బాధలు పెట్టినాము. మీరు దేవతాస్వరూపులు. రూపు తాల్చిన దివ్యక్షమామూర్తులు. మా అమ్మగారూ, నేనూ ఏమిచేస్తే మాపాపాలను మేము కడిగివేసుకోగలమో తెలియక క్రుంగిపోతున్నాము. మీరు క్షమించానని ఒకచిన్న ముక్క వ్రాస్తే అది హృదయానికద్దుకొని అదే పదివేలని ఆ ఉత్తరాన్ని పూజచేసుకొంటూ వుంటాను. మా అమ్మగారు మీ అమ్మగారితో ఏదో

మనవిచేశారు. అది తప్పక నిర్వర్తించవలసిం దని మీ పాదాలమీద వ్రాలి ప్రార్థిస్తున్నాను. లక్ష్మికూడా యిందులో ఒక ఉత్తరము పంపింది. మా ఉత్తరాలు గాని, మా కోర్కెలుగాని మీకూ, మీ ఆశయాలకూ ఏమీ అడ్డురాగూడ దని మిమ్మల్ను పదేపదే ఆశిస్తున్నాము. ఈనాటి మాహృదయాలను సంపూర్ణకరుణతో చూడగలుగుటకు మీకు శక్తి యివ్వవలయునని భగవంతుని వేడుకొంటున్నాను. ఇందుతో పంపినది నీచమైన నాతల్లియు, నేనున్ను తీర్చలేని మీతండ్రిగారి బాకీ తీర్చడానికి పంపుకొన్న అర్పణ.

నేను జన్మ ఎత్తినది మొదలు ఒక్కవిషయమైనా కృతార్థత అని అనకొనేటట్లు నిర్వర్తించలేదు. ప్రాక్టీసులేని వకీలును, మహోత్తమురాలైన భార్యను పూజించలేని హీన భర్తను, నీచురాలైన పెంపుడు తల్లిని దిద్దలేని పిరికికొడుకును. ఈవిషయంలో నన్నాతమ్మ ఒప్పించగలనని ధైర్యములేని అశక్తుడను.

మీ విధేయుడు,

సుందర్రావు"

"శ్రీ శ్రీ పార్వతీస్వరూపురాలైన లలితాదేవి అక్కగారికి—

చెల్లెలు లక్ష్మి వ్రాసుకొన్న వినయపూర్వకమైన ఉత్తరము.

మీకు నమస్కారము చేస్తున్నా నక్కయ్యా. నేను మిమ్మల్ని ఏమని పూజింపగలను? నేను మీకూ, మీ ధర్మానికీ అడ్డంవచ్చిన పాపాత్మురాలను. నేను ఏమిచేస్తే మీరు నన్ను క్షమించగలరు? మీరు నాప్రాణదానమూ, నాబిడ్డప్రాణదానమూ చేశారు. నేను, నాబిడ్డ నీబిడ్డలం. నేను మీదాసీక్రింద వుంటాను. మీరు మీయింటికి రండి. నేను ఏమాత్రము అడ్డమైనా నాయథాస్థానమునకు పోయి మిమ్మల్ని దూరముగానే వుండి నాహృదయమార పూజించుకుంటాను. మీరు మీయింటికి వస్తే ప్రతిరోజూ ఉదయాన్ని మీకాళ్లు కడిగి ఆనీళ్లు నా నెత్తిమీద పోసుకొంటాను. మీకు బట్టలు వుతుకుతాను. మీకు భోజనము వండిపెడతాను. మిమ్మల్ని చూసుకొంటూ వుప్పొంగిపోతాను. మీపాదాలు నాహృదయానికి అదుముకొంటాను. మీరు మీ యింటికి వచ్చిననాడు నాజన్మ సఫల మవుతుంది. మీరు నాకు అక్క అని తెలుసుకొన్ననాడు నాజీవితం తరించిం దని ఏడేడు లోకాలూ ఉప్పొంగిపోయాను. మిమ్మల్ను 'అక్కా' అని నన్ను నోరారా పిలవనీయండి.

ఇట్లు,

ప్రేమతో మిమ్మల్ను పూజచేస్తున్న మీచెల్లెలు

లక్ష్మి."

లలితమ్మ కళ్ల నీళ్లు పెట్టుకొంటూ ఆ రెండు ఉత్తరములను కళ్ల కద్దుకొంది.

౯

భర్త, లక్ష్మి ఇరువురూ వ్రాసిన ఉత్తరములు చదువుకొని వెళ్లి తండ్రిచేతి కిచ్చింది లలితమ్మ. ఐదువేలరూపాయలూ తండ్రిప్రక్కనే పెట్టింది. తాను తిన్నగా గదిలోనికి పోయి మంచముపైన మేను వాల్చింది. భర్త ఎదురుగుండా చంటిపిల్లవాడిలా కూర్చున్నాడు. ఆయన నిజంగా వెర్రివాడు. ఆయన ఈజీవితములో ఒకపనీ నెరవేర్చలేకపోయినాడు పాపం. ముప్పదినాలుగేండ్ల యీడువాడై వలుబది ఐదేండ్లయీడువానిలా గయిపోయినాడు. ఆయనకు వైద్యంచేస్తే మళ్లీ పడుచువా డవడూ? కరకుశ హృదయం కలిగి మహారాణిలా పరిపాలనాశక్తి గలిగిన, తల్లితనం ఎరగని ఒక స్త్రీచేతిలో నీరసుడై బానిసయిపోయాడు.

లలితమ్మమనస్సు ద్రవించిపోయింది. తానున్న తల్లితనము ఎరగదు. తన స్త్రీత్వం ఆశించే తల్లితనం ఎదుట సుందర్రావు తెలివితక్కువబాలకు డైనట్లు తోచింది. సుందర్రావు దిక్కులేని శిశువులా కనపడ్డాడు.

"పూర్ బాయ్ (Poor boy), పాపం, ఆ బాలుడు" అని అనుకొన్నది.

పురుషుడు బలవంతుడై స్త్రీని పరిపాలించాడు, స్త్రీని లాలించాడు, స్త్రీని పోషించాడు, ఆమెను బుజ్జగించాడు, ఆమెకు రక్షకు డైనాడు. ఇప్పుడు

తన భర్త ఏమీ తెలియని తెలివితక్కువవాడైన బాలకుడుగా ఉన్నాడు. అతనిని రక్షించడము తన విధి.

ఈలాంటి ఆలోచనలు ఆలోచించుకొంటూ ఏ రెండుగంటలకో కునుకువారింది లలితమ్మ. తన మామూలుచొప్పున అయిదుగంటలకే లేచి స్నానము చేసి శుభ్రవస్త్రాలు ధరించి వ్రాతగదిలోనికి పోయి భర్తకును, లక్ష్మికిని ఉత్తరాలు వ్రాసింది. ఆరెండు ఉత్తరములను తండ్రిగారు గదిలోనికి రాగానే ఆయన చేతి కిచ్చింది. ఆయన ఆ రెండుఉత్తరములను చదువుకొన్నాడు. నిన్నటి నోట్లు అయిదున్నూ ఆఉత్తరములతోపాటు మడచి ఆమెచేతి కిచ్చినాడు. "అమ్మా, నీహృదయంలో సరస్వతి, లక్ష్మి, పార్వతి ఎప్పుడూ నివసిస్తూనేవుంటారు. నీకు తోచింది భగవత్ప్రేరితం" అనిమాత్రం అన్నాడు. లలితమ్మ ఉత్తరములు కవరులో పెట్టి కవరు అంటించి పైఅడ్రసు వ్రాసి గంటకొట్టి బంట్రోతును పిలిచి అతని చేతికి ఉత్తరములు యిచ్చి సుందరరావుగారికి యివ్వవలసిందని ఆజ్ఞ ఇచ్చింది. తాను ఫలహారములు తీసుకొనుటకు లోనికి వెళ్లిపోయింది.

సుందరరావు ఆఉత్తర మందుకొన్నాడు. అతని గుండెలు దడదడ కొట్టుకొన్నవి. తనయొక్క అదృష్ట దురదృష్టాలు ఆ ఉత్తరంలోనే ఉన్నవికదా అనుకొన్నాడు. ఉత్తరమును కళ్ల కద్దుకొన్నాడు. తల ఎత్తి భగవంతుని ప్రార్థించాడు.

## ౧౦

"ప్రియా,

మీ ఉత్తరము, చెల్లెలిఉత్తరము రెండూ చూచితిని. రాత్రి ఒంటిగంటవరకూ నిద్రపోలేదు. లోకానికి, దేశానికి, కుటుంబానికి వచ్చే మార్పులు భగవంతుని చేతుల్లో ఉన్నవిగాని మనచేతిలో ఏమి ఉన్నవి? జ్ఞానవంతులు వెనకటి విషయాలు తలపెట్టరు. జరిగిన విషయాలను మార్చలేము.

నేను మీయింటికి వచ్చి వెనకటిమల్లే వుండడము ఎన్నటికీ భావ్యముకాదు. ఎంత ఉత్తములైవున్నప్పటికీ మనుష్యప్రకృతులు మనుష్యప్రకృతులే. నా చెల్లెలు లక్ష్మి పరమసుశీల. ఆమె మీతో ఎప్పుడూ వుండడానికి అర్హురాలు. ఏ కారణాలవల్లనైతేనేమి, నేను రోగినారాయణసేవ చేసే ఈదారిని తీసుకొన్నాను. అది మన యింటిదగ్గరే వుండి చేయవచ్చునని మీరు వాదించవచ్చు. కాని దానివల్ల మీకున్నూ, నాకున్నూ, లక్ష్మికికూడా యిబ్బందులు వస్తాయని నానమ్మకం.

మీరు ఎప్పటికైనా నాభర్తలు. హిందూస్త్రీనైన నాహృదయంలోంచి మీమూర్తి ఎప్పుడూ మాయంకాలేదు. నాచెల్లెలితోపాటు నేనుకూడా ఈ ఊళ్లో వున్నన్నాళ్లూ మీకు సేవచేస్తాను. తరువాత నేను ఎక్కడ వున్నా మీరు, నాచెల్లెలు, అత్తగారు ఎప్పుడూ వస్తూవుండవలసింది. మీరు పంపిన ఐదువేల రూపాయలూ ఇందుతో తిరిగీ పంపివేస్తున్నాను. ఈ అయిదువేలూ ఏలూరు ఆస్పత్రిలో ఆడవాళ్ల భాగమును వృద్ధిచేయడానికి ప్రభుత్వమువారికి అత్తగారిపేర ఇవ్వండి. ఎల్లుండి ఆదివారమునాడు నేను, మా అమ్మ, నాన్నగారు అక్కడికి భోజనానికి వస్తున్నాము.

చెల్లెలికి కౌగిలింతలు. చిట్టితల్లికి ముద్దులు. అత్తగారికి, పిన్నిగారికి, రంగయ్యగారికి నమస్కారములు.

జీవితంలో ఏవిషయంలోనూ సాఫల్యము పొందలేదని ఏమాత్రమూ విచారించవద్దు. ఇక్కడనుంచి విజయం మీవంతు అని నమ్మండి. ధైర్యముతో ఛాతీ విప్పుకొని విజయంపొందేవాడిలాగ సంచరించండి. నేనూ, లక్ష్మి మీవెనకాల ఎప్పుడూ వుంటాము.

ఇట్లు
ప్రేమతో మీ
లలిత."

సుందరరావు మోకరించి ఆ ఉత్తరాన్ని తలపైన పెట్టుకొన్నాడు.